# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 48, EDITOR:CHERUKU UPENDAR, DATE : THURSDAY 08 JUNE 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 48, ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : గురువారం 08 జూన్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## తెలంగాణ వర్శిటీలో విజిలెన్స్ దాడులు

నిజామాబాద్ - ప్రభాత సూర్యుడు

నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లి సమీపంలో ఉన్న తెలంగాణ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక సోదాలు చేశారు. యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ భవనంలో సోదాలు చేశారు. అనినీతి ఆరోపణల రావడం వల్ల విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈ సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. అకౌంట్ సెక్షన్, ఏవో సెక్షన్, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్లలో సోదాలు చేశారు. యూనివర్సిటీలోని కళాశాల భవనాల్లోనూ విజిలెన్స్ దాడులు జరిగాయి. ఈసీ మెంబర్లకు, వీసీకి మధ్య నెలకొన్ని గొడవలపై .

మిగతా 2లో...

## టార్గెట్ తెలంగాణ
# మోడీ భారీ రోడ్ షో

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ ఏడాది చివరి నాటికి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో భారతీయ జనతా పార్టీ తెలం గాణపై ఫోకస్ పెంచింది. తెలంగాణలో మరికొద్ది నెలల్లో ఎన్నికలు ఉండడం వల్ల బీజేపీ అధిష్ఠానం రాష్ట్రంపై ఫోకస్ పెట్టింది. జనాల్లో బీజేపీ ఊపు తగ్గకుండా, మరింత పెంచడానికి నిరంతరం ప్రజల్లో ప్రణాళికలు బీజేపీ వేస్తోంది. ఇప్పటికే ప్రజాసంగ్రామ యాత్ర పేరుతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రజల్లోకి వెళ్లగా, తాజాగా మహా జన సంపర్క్ అభియాన్ పేరిట మరోసారి బీజేపీ జనాలను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. ఇకపై వరుసగా బీజేపీ అగ్రనేతలను తెలంగాణకు తీసుకురానున్నారు.ఇప్పటికే బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటనలు ఖరారు అయిన సంగతి తెలిసిందే. త్వరలోనే ప్రధాని మోదీని కూడా తెలంగాణకు ఆహ్వానించనున్నారు. మహా జన్ సంపర్క్ అభియాన్ ?లో భాగంగా ఈ నెలలో మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించే రోడ్ షోలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. కర్ణాటక తరహాలోనే

మిగతా 2లో...



## పథకాలు ఓట్లు కురిపిస్తాయా..!



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

- కేసీఆర్ రాజకీయ వ్యూహాల్లో అపర చాణక్యుడు
- ఎన్నికల్లో గెలవడానికి ఆయన ఏ వ్యూహం
- నాలుగు నెలల పాటు పథకాల పంట

తెలంగాణ సీఎం కేసీఆర్ రాజకీయ వ్యూహాల్లో అపర చాణక్యుడు. ఈ విషయాన్ని రాజకీయ ప్రత్యర్థులు కూడా ఒప్పుకుంటారు. వచ్చే ఎన్నికల్లో గెలవడానికి ఆయన ఏ వ్యూహం రెడీ చేస్తున్నారన్నది చాలా మందికి అంతుబట్టని అంశంగా మారింది. కేసీఆర్ వ్యూహాల్లో ఓటర్లను పథకాల్లో ముంచడం అనేది కీలకంగా ఉంటుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. మూడో సారి అధికారంలోకి తీసుకు రావడానికి నాలుగు నెలల్లో నలభై వేల కోట్ల రూపాయలు ఓటర్లకు లబ్ది చేకూర్చబోతున్నట్లుగా బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ ప్రజలకు వచ్చే నాలుగు నెలల పాటు పథకాల పంట పండనుంది. కేసీఆర్ వచ్చే నాలుగు నెలల పాటు ఓటర్లందరికీ నలభై వేల కోట్లు పంచడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఇందు కోసం

మిగతా 2లో...

## మరో వారం ఎండలే

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ఇప్పటికే ఎండలు మండి పోతున్నాయి. ప ఎదిమిది గంటలు దాటిందంటే గడపదాటి అడుగు బయటకు పెట్టాలంటే జనం జంకుతున్నారు. సాధారణంగా జూన్ మొదటి వారంలో వాతావరణం చల్లబడుతుంది. తొలకరి జల్లులు కురుస్తాయి. ఏరువాక మొదలౌతుంది.రైతులు వ్యవసాయ పనులలో బిజీ అవుతారు. కానీ ఈ ఏడో ఆ పరిస్థితి లేదు. జూన్ రెండో వారినికి కానీ తొలకరి పలకరించే అవకాశం లేదని వాతావరణ శాఖ చెప్పేసింది. ఇందుకు ఎల్ నినో పరిస్థితులే కారణమని పేర్కొంది.

మిగతా 2 లో...

## తెలంగాణలో మారుతున్న
# రాజకీయ సమీకరణాలు

- రాజకీయాల్లో వేగంగా మార్పులు మార్పులు
- కర్నాటక ఫలితాలనే రిపీట్ చేస్తామంటున్న కాంగ్రెస్
- బీజేపీ కూడా తెలంగాణపై ఫోకస్
- బీజేపీ అగ్రనేతలు రాష్ట్రానికి
- కేసీఆర్ కొత్త ఆలోచనలతో ముందడుగు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కర్నాటక ఎన్నికల తర్వాత తెలంగాణ రాజకీయాల్లో వేగంగా మార్పులు మొదలయ్యాయి. తెలంగాణపై రెండు ప్రధాన జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ ఫోకస్ పెంచాయి. కర్నాటక ఫలితాలనే తెలంగాణలోనే రిపీట్ చేస్తామని కాంగ్రెస్ నేతలు ఢంకా బజాయించి చెబుతున్నారు. రాహుల్ గాంధీ అయితే ఏకంగా అమెరికా పర్యటనలో హూంకారమే చేశారు. తెలంగాణ నుంచి బీజేపీని ఊడ్చి పారేస్తామని ఆయన భీషణ ప్రకటన చేశారు. తద్వారా



తెలంగాణ కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు రాహుల్ గాంధీ. మరోవైపు కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరపరాజయం పొందిన బీజేపీ కూడా తెలంగాణపై ఫోకస్ పెంచేసింది. ఇందులో భాగంగా బీజేపీ అగ్రనేతలు రాష్ట్రానికి రానున్నారు. ఈ నేపథ్యంలోనే మూడు భారీ బహిరంగ సభలకు బీజేపీ ప్లాన్ చేసింది. మోదీ

మిగతా 2లో...

## తెరపైకి మళ్లీ
# కోవర్టులు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

బీజేపీలో కోవర్టుల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ బీజేపీలో కేసీఆర్ కోవర్టులున్నారని సంచలన ఆరోపణలు చేశారు. మరో 15 రోజుల్లో సంచలన ప్రకటన చేస్తానన్నారు. బీజేపీలో కేసీఆర్ కోవర్టులున్నారని బీజేపీ నేత, పటాన్ చెరు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. ఆ కోవర్టుల పేర్లను బీజేపీ పెద్దలకు తెలియజేశానన్నారు.

కోవ ర్టులెవరో త్వరలో వెల్లడిస్తానన్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ కాంగ్రెస్ లో చేర నున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. 15 రోజుల్లో కీలక నిర్ణయం ప్రకటిస్తానన్నారు.

మిగతా 2లో...

## టీడీపీ, బీజేపీ పార్టీలలో
# చర్చోపచర్చలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు







తెలంగాణ రాజకీయాల్లో కనిపించని మార్పులు చోటు చేసుకుంటున్నట్లుగా పైకి జరుగుతున్న పరిణామాలు సూచనలు ఇస్తున్నాయి. చంద్రబాబు ఢిల్లీ పర్యటన తర్వాత ఏపీ కన్నా తెలంగాణలో ఎక్కువ చర్చ జరుగుతోంది. దీనికి కారణం బీజేపీతో టీడీపీ పొత్తు ఉంటుందన్న చర్చ ప్రారంభం కావడమే. ఎన్నికలకు ఇంకా ఎంతో సమయం లేకపోవడంతో అన్ని రాజకీయ పార్టీలు సన్నాహాలు పూర్తి చేసుకుంటున్నాయి. ఈ కారణంగా బీజేపీ, టీడీపీ వేర్వేరుగా తమ అంతర్గత చర్చలను ప్రారంభించడంతో.. ఈ చర్చలకు.. ఢిల్లీలో చంద్రబాబు పర్యటనకు ఏమైనా లింక్ ఉందా అన్న సందేహం రాజకీయవర్గాలకు వస్తోంది. చంద్రబాబునాయుడు ఇటీవలి కాలంలో తెలంగాణ టీడీపీపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. మొత్తం టీడీపీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ కే అప్పగించారు. ఎప్పుడైనా వారంతా?ల్లో మాత్రమే టీడీపీ కార్యాకలాపాలపై దృష్టి పెడుతున్నారు చంద్రబాబు. అయితే హఠాత్తుగా ఆయన పార్టీ ఆఫీసుకు వెళ్లారు. కాసాని జ్ఞానేశ్వర్ సహా కీలక నేతలతో మంతనాలు జరిపారు. ఇది

మిగతా 2లో...

## దుమ్మురేపిన ఆదిపురుష్ ట్రైలర్





హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రధాన పాత్రలో దర్శకుడు ఓమ్ రౌత్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'ఆదిపురుష్'. ఈ సినిమాను రామాయణ ఇతిహాసాల ఆధారంగా తెరకెక్కించారు. చిత్రంలో ప్రభాస్ రాముడి పాత్రలో కనిపించగా సీత పాత్రలో కృతి సనన్ నటించింది. ప్రస్తుతం ప్రభాస్ ఫ్యాన్స్ తో పాటు యావత్ భారత్ ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూస్తోన్న సినిమా 'ఆదిపురుష్'. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. దీంతో ఈ సినిమా పై అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ఇప్పుడు తాజాగా 'ఆదిపురుష్' ప్రీ రిలీజ్ ఈవెంట్ ను తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ స్టేడియంలో గ్రాండ్ గా

మిగతా 2లో...

## ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో
# కీలక పరిణామం
### ఎంఎల్‌సి కవితలో పెరిగిన టెన్షన్..?



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

దేశ వ్యాప్తంగా పెను ప్రకంపనలు సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కుంభకోణంలో నిందితు డు, అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి అప్రూవర్‌గా మారు తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అప్రూవర్‌గా మారుతానని శరత్ ముందుకు రావ డాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా ఓకే చెప్పేసింది. అయితే.. శరత్ చంద్రారెడ్డి అప్రూవర్‌గా మారటాన్ని వ్యతిరేకిస్తూ.. ఢిల్లీలోని అధికార ఆమ్ ఆద్మీ పార్టీ సవాల్ చేస్తోంది. ఈ మేరకు న్యాయ నిపుణులతో ఆప్ నేతలు సంప్రదింపులు

మిగతా 2లో...

## తెలంగాణ వర్సిటీలో విజిలెన్స్ దాడులు

(మొదటిపేజీ తరువాయి)
కూడా అధికారులు దృష్టి సారించారు. యూనివర్సిటీలో అక్రమ నియామకాలు, అక్రమ లావాదేవీలు జరిగాయని ఈసీ చర్యలకు దిగింది. వీసీ రవీందర్ గుప్తా అక్రమాలకు పాల్పడ్డారని రిజిస్ట్రార్‌ను మారుస్తామని ఈసీ ప్రకటించింది. దీనికి వ్యతిరేకంగా కొత్త రిజిస్ట్రార్‌ను నియమిస్తూ వీసీ నిర్ణయం తీసుకున్నారు. దీంతో యూనివర్సిటీలో అడ్మినిస్ట్రేషన్ గందరగోళంగా మారింది. ఈసీ మెంబర్లకు, వీసీకి మధ్య కోల్డ్ వార్ జరుగుతోంది. అక్రమ నియామకాలు, లావాదేవీలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తాజాగా రంగంలోకి దిగారు. హైదరాబాద్‌లోని రూసా భవనంలో జూన్ నెల 3వ తేదీన పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఇటీవల తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన పరిణామాలు, గతంలో పాలక మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై కూలంకషంగా చర్చించారు. ఆ 60వ పాలక మండలి సమావేశానికి వీసీ రవీందర్ మరోసారి డుమ్మాకొట్టారు. వీసీ అక్రమాలు చేశారని, దానిపై విచారణ కమిటీ వేయాలని సమావేశంలో పాలకమండలి మెంబర్లు ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు. వీసీ చేసిన అక్రమ నియామకాలు, ఇతరుల పేర్ల మీద బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేయడం, దినసరి ఉద్యోగం కింద పని చేసిన వారికి ఈసీ అనుమతి లేకుండానే బ్యాంకు నుంచి రూ.28 లక్షలు చెల్లించిన అంశాలకు సంబంధించి కమిటీని వేసి చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారు.

## దుమ్మురేపిన ఆదిపురుష్ ట్రైలర్

(మొదటిపేజీ తరువాయి)



నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభాస్ తో పాటు ముఖ్య అతిథిగా ఆధ్యాత్మిక గురువు చినజీయర్ స్వామిజీ హాజరయ్యారు. అలాగే ఇటు సినీ ప్రముఖులతో పాటు అటు ప్రభాస్ అభిమానులతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. 'ఆదిపురుష్' సినిమా టైటిల్ అనౌన్స్ చేసిన దగ్గర నుంచే ఈ మూవీపై అంచానలు భారీగా పెరిగిపోయాయి. అభిమానులు ఎప్పుడెప్పుడు ఈ సినిమా చూద్దామా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే 'ఆదిపురుష్' నుంచి విడుదలైన ఫస్ట్ లుక్, ట్రైలర్ లు అందరి ఆకట్టుకున్నాయి. మూవీ ట్రైలర్ కు ప్రేక్షకుల దగ్గరనుంచి విశేష స్పందన వచ్చింది. అయితే ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ సందర్భంగా 'ఆదిపురుష్' మూవీ కొత్త అప్డేట్ ఉంటుందని ఎదురుచూస్తున్న అభిమానులకు సర్ప్రైజ్ గిఫ్ట్ ను అందించింది మూవీ టీమ్. 'ఆదిపురుష్' సినిమాకు సంబంధించిన ఫైనల్ ట్రైలర్ ను రిలీజ్ చేశారు మేకర్స్అందరూ ఊహించినట్టుగానే 'ఆదిపురుష్' సెకండ్ ట్రైలర్ ను విడుదల చేశారు మేకర్స్. ఇక ట్రైలర్ విషయానికొస్తే.. మూవీ నుంచి వచ్చిన ఫైనల్ ట్రైలర్ అదరగొట్టిందనే చెప్పాలి. మూవీ ట్రైలర్ లో విజువల్స్, బ్యాగ్రౌండ్ మ్యూజిక్ వేరే లెవల్ లో ఉన్నాయి. గ్రాఫిక్స్ వర్క్ విషయంలో ఈసారి పూర్తి శ్రద్ధ పెట్టినట్టు కనిపిస్తోంది. ట్రైలర్ లో లంకేష్ సీతా దేవి దగ్గరకు బిచ్చగాడి రూపంలో వెళ్లి తర్వాత సీతను ఎత్తుకెళ్లిపోయిన సీన్ దగ్గర నుంచి స్టార్ట్ చేశారు. తర్వాత రాఘవుడు తన భార్యను వెతుక్కుంటూ లంక బయలుదేరడం చూపించారు. తర్వాత రాఘవుడు లంకేష్ తో ఎలా పోరాడిన సన్నివేశాలను చూపిస్తూ ట్రైలర్ ను చాలా బాగా కట్ చేశారు. ముఖ్యంగా రాఘవుడు చెప్పే డైలాగ్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. మొత్తంగా ఈసారి ప్రభాస్ అభిమానులను 'ఆదిపురుష్' మంచి విజువల్ ట్రీట్ అనే చెప్పాలి.'ఆదిపురుష్' సినిమా టైటిల్ అనౌన్స్ చేసినప్పటి నుంచీ ఈ మూవీపై భారీ అంచానలే ఉన్నాయి. సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించిన మూవీ టీమ్ సినిమా ప్రమోషన్స్ ల విషయంలోనూ అంతే శ్రద్ధ వహిస్తోంది. అందుకే ప్రీ రిలీజ్ ఈవెంట్ ను కూడా భారీ స్థాయిలోనే నిర్వహించింది. దాదాపు 2 కోట్లు ఖర్చే చేసి ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ ను ఏర్పాటు చేశారు మేకర్స్. కార్యక్రమానికి ముందు కాసేపు వర్షం కురవడంతో అభిమానులు ఆందో ళన వ్యక్తం చేశారు. కానీ తర్వాత వాతావరణం అనుకూలించడంతో ప్రోగ్రాంను అనుకున్న సమయానికే ప్రారంభించారు. స్టేడియంలో వేసిన భారీ సెట్టింగ్ లు అందర్నీ ఆకట్టుకున్నాయి. వందలాది మంది ఆర్టిస్ట్ ల లైవ్ ప్రదర్శనలు, దాదాపు 50 అడుగుల ప్రభాస్ హోలోగ్రామ్ విగ్రహం, అయోధ్య సెట్టింగ్ లు ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయి. ఈ వేడుకకు ఆధ్యాత్మిక గురువు చినజీయర్ స్వామిజీ స్వయంగా హాజరై చిత్ర బృందానికి శుభాశీస్సులు అందజేశారు. ప్రభాస్ అభిమానుల కోలాహలం, జై శ్రీరామ్ నినాదాలతో స్టేడియం ప్రాంగణం అంతా సందడిగా మారింది. మొత్తంగా చరిత్రలో నిలిచిపోయే విధంగా 'ఆదిపురుష్' ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించారు మేకర్స్. ఈ సినిమా జూన్ 16 న ప్రపంచ వ్యాప్తంగా పలు భాషలలో ప్రేక్షకుల ముందుకు రానుంది

## పథకాలు ఓట్లు కురిపిస్తాయా..!

(మొదటిపేజీ తరువాయి)
అనేక రకాల పథకాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నారు. వివిధ పథకాలను అమలు చేయడం తోపాటు.. పెండింగ్‌లో ఉన్న వాటికీ నిధులు మంజూరు చేయనున్నారు. కేసీఆర్ అమ్ములపొదిలో ఇప్పటికీ చాలా పథకాలు రెడీగా ఉన్నాయి. ఎప్పట్లాగే రైతుబంధు నిధులు కూడా ఈ సారి ఎన్నికల సమయంలోనే రైతుల ఖాతాల్లో పడతాయి. ఇక కొత్తగా ప్రవేశ పెట్టిన దళితబంధు, గృహలక్ష్మి, బీసీలకు రూ.లక్ష ఆర్థిక చేయూత అమలును ప్రారంభిచేస్తున్నారు. బీసీలకు రూ. లక్ష కావాలంటే దరఖాస్తు చేసుకోండి అనే లింక్ కూడా ఇప్పటికే అందుబాటులోకి తెచ్చేశారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, స్కాలర్‌షిప్‌లు, కేసీఆర్ కిట్, పల్లెలకు, మున్సిపాలిటీలకు, మన ఊరు మన బడి వంటి వాటికి కూడా ఇప్పుడు వరుసగా నిధులు మంజూరు కానున్నాయి. సెప్టెంబర్ దాకా ప్రతి స్కీమ్‌కు రూ. వేల కోట్లు విడదలవుతూ ఉంటాయి. వానాకాలం సీజన్ రైతు బంధుకు రూ.7,500 కోట్లు రైతు ఖాతాల్లో జమ చేయనున్నారు. దళితబంధు కోసం 5వేల కోట్ల మేర ఖర్చు చేస్తామని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో పాటు గృహలక్ష్మి స్కీమ్? కింద రూ.3 వేల కోట్ల నుంచి రూ.4వేల కోట్ల దాకా ఇవ్వనున్నారు. బీసీలకు ఆర్థిక చేయూత కింద ఇచ్చే రూ.లక్ష కోసం రూ.2 వేల కోట్లు ఖర్చు చేయనుంది. రుణమాఫీ కోసం రూ.6 వేల కోట్లు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోదం?. గిరిజన సంక్షేమ శాఖలో కొన్ని సబ్సిడీ స్కీముల కోసం రూ.300 కోట్లు ఖర్చు చేస్తారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు, మన ఊరు మన బడి, స్కాలర్ షిప్ లు తదితరాలకు రూ.6 వేల కోట్లు విడుదల చేస్తామని ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు. ఇన్ని వేల కోట్లకు పథకాలు పెట్టేస్తే .. మరి నిధులు ఎక్కడ నుంచి వస్తాయన్నది చాలా మందికి వచ్చే డౌట్. దీని కోసం కేసీఆర్ ఇప్పటికే మాస్టర్ ప్లాన్ రెడీ చేశారు. ఓఆర్అర్ లీజు, భూముల అమ్మకం, ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో ఆర్బీఐ నుంచి బహిరంగ మార్కెట్ రుణాలు .. తెలంగాణ సర్కార్‌కు వచ్చే ఆదాయం ఇలా.. అనేక వనరుల నుంచి సమీకరించుకుంటారు. సంపదను అమ్మడం ద్వారానే సమీకరించుకుంటారని అంటు న్నారు. కేసీఆర్ ప్లాన్ అనుకున్నట్లుగా జరిగితే.. నాలుగు నెలల్లో మెజార్టీ ఓటర్లకు ప్రభుత్వం నుంచి నగదు అందు తుంది. ఓట్లు వేసేటప్పుడు ప్రభావితం చేయకుండా ఉంటుందా ?

## తెరపైకి మళ్లీ కోవర్టులు

(మొదటిపేజీ తరువాయి)
కోవర్టులు వారి తీరును మార్చుకోకపోతే వారి పేర్లను మీడియాకు ఇస్తానన్నారు.అన్ని పార్టీల్లో సీఎం కేసీఆర్ కోవర్టులున్నారంటూ గతంలో బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. బీజేపీలోనూ కేసీఆర్ కోవర్టులున్నారని ఈటల అన్నారు. అయితే ఈటల వ్యాఖ్యలపై స్పందిస్తూ... బీజేపీలో కేసీఆర్ కోవర్టులు లేరని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కొట్టిపడేశారు. కోవర్టులున్నారని ఎవరైనా నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. తాజాగా బీజేపీ కోవర్టులున్నారని ఆ పార్టీ నేత నందీశ్వర్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో కేసీఆర్ కోవర్టులు ఉన్న మాట నిజమేనని నందీశ్వర్ గౌడ్ అన్నారు. కోవర్టుల పేర్లను అధిష్ఠానానికి అందించానన్నారు. వారి తీరు మారకపోతే మీడియా సాక్షిగా అందరి పేర్లు బయట పెడతానని నందీశ్వర్ గౌడ్ హెచ్చరించారు. మరో 15 రోజుల్లో తన సంచలన ప్రకటన చేస్తానన్నారు. తాను బండి సంజయ్, ఈటెల రాజేందర్ వర్గం కాదన్న నందీశ్వర్ గౌడ్.. వచ్చే ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని సీఎంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.అన్ని పార్టీల్లోనూ కేసీఆర్ కోవర్టులున్నారని ఇటీవల ఈటల రాజేందర్ అన్నారు. వారి వల్లే కేసీఆర్ పార్టీలను దెబ్బతీస్తున్నారన్నారు. ఇన్ఫార్మర్లు తమ వ్యూహాలను కేసీఆర్‌కు చేరవేరుస్తున్నారన్నారు. లీకుల కారణంగా నేతలు బీజేపీలో చేరేందుకు వెనకడుగు వేస్తున్నారన్నారు. ఈటల ఆరోపణలను బండి సంజయ్ అప్పట్లో తప్పుబట్టారు. తమ పార్టీలో కోవర్టులెవరూ లేరన్నారు. బీజేపీలో కోవర్టులుండే ఛాన్సే లేదన్నారు. అయితే తెలంగాణ బీజేపీ నేతల మధ్య విభేదాలున్నాయని జోరుగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో మళ్లీ కోవర్టుల అంశం తెరపైకి వచ్చింది. నందీశ్వర్ గౌడ్ కూడా కోవర్టుల కామెంట్స్ చేయటం హాట్ టాఫిక్‌గా మారింది. నందీశ్వర్ గౌడ్ వ్యాఖ్యలతో తెలంగాణ బీజేపీలో అంతర్గత కలహాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. అయితే నందీశ్వర్ గౌడ్ కాంగ్రెస్ లోకి చేరుతున్నారని, అందుకే బీజేపీ అలజడి సృష్టించేందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేశారని బీజేపీ నేతలు అంటున్నారు.

## ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం

చేస్తున్నారు. త్వరలోనే రౌజ్ అవెన్యూ కోర్టులో ఆప్ పిటిషన్ దాఖలు చేయనున్నది. లిక్కర్ కేసుకు సంబంధించి అనేక కీలక అంశాలను ప్రత్యేకించి శరత్ చంద్రారెడ్డికి సంబంధించి గతంలో దర్యాప్తు సంస్థలు ఆయనపై మోపిన అభియోగాలు సహా పలు కీలక అంశాలను పిటీషన్‌లో ప్రస్తావించేందుకు ఆప్ సిద్ధమైంది. ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ టార్గెట్‌గానే లిక్కర్ కేసులో పరిణామాలు జరుగుతున్నాయని ఆప్ నేతలు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రత్యేక కోర్టులో సవాల్ చేయాలని ఆప్ భావిస్తోంది.

### కవిత ఏం చేస్తారో..!?

ఈ పరిస్థితుల్లో ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న.. ఇప్పటికే పలుమార్లు విచారణ ఎదుర్కొన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఏం చేయబోతున్నారన్నది ప్రశ్నార్థంగా మారింది. ఆప్ ఇలా సవాల్‌కు సిద్ధమైన పరిస్థితుల్లో కవితలో టెన్షన్ పెరిగిపోయినట్లుగా తెలుస్తోంది. ఈ కేసులో ఎలా ముందుకెళ్లాలి..? ఎవరితో చర్చించాలనే విషయాలు తెలియక అయోమయంలో పడినట్లు సమాచారం. బుధవారం ఉదయం ఈ విషయంపై సీఎం కేసీఆర్, మంత్రులు హరీష్, కేటీఆర్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. మరోవైపు.. కవితకు ఎలాంటి ఢోకా అక్కర్లేదని.. బీఆర్ఎస్-బీజేపీ మధ్య ఈ కేసులో లోపాయికారి ఒప్పందం కుదిరిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అందుకే ఈ మధ్య బీజేపీని కేసీఆర్.. కేసీఆర్‌ను బీజేపీ అస్సలు విమర్శించుకోవట్లేదని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. నిర్మల్‌లో జరిగిన బహిరంగ కేసీఆర్ ప్రసంగం చూస్తేనే స్పష్టంగా అర్థమవుతోందని ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నాయి.

గేది ఇదేనా..!? కాగా.. శరత్ చంద్రారెడ్డి అప్రూవర్‌గా మారతానన్న అభ్యర్థనకు ప్రత్యేక కోర్టు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే.. అప్రూవర్‌గా మారటానికి ముందే పూర్తిస్థాయి బెయిల్‌తో శరత్ జైలు బయట ఉన్నారు. ఆయనకు వై కేటగిరీ భద్రతను కల్పించాలని హోం శాఖ ఆదేశించినట్లు వివరించాయి. శరత్ అప్రూవర్‌గా మారి కుంభకోణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పాత్రను వెల్లడించే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం.

కవిత ప్రేరణతోనే తాను మద్యం వ్యాపారంలో పాల్గొన్నానని శరత్ చెప్పే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇప్పటికే గోరంట్ల బుచ్చిబాబు అప్రూవర్‌గా మారిన విషయం తెలిసిందే. ఇప్పుడు శరత్ చంద్రా రెడ్డి కూడా అప్రూవర్‌గా మారితే కవిత పేరు మరోసారి తెరపైకి వచ్చే అవకాశం ఉంది. నిజానికి, స్కాంలో కవిత లావాదేవీల సమాచారం ఉన్నా కేంద్రం తగిన చర్యలు తీసుకోవడం లేదని రాష్ట్ర బీజేపీ నేతలు పలువురు ఢిల్లీ పెద్దలకు అనేక సార్లు చెప్పారు. కేసీఆర్ కుటుంబాన్ని కేసుల వలయంలో ఇరికిస్తే తప్ప బీఆర్ఎస్ బలహీనం కాదని, బీజేపీకి అవకాశాలు దక్కవని చెబుతూవచ్చారు. ఢిల్లీలో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఏదో అవగాహన ఉందనే ప్రచారం జరుగు తోందని, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మడం మొదలు పెట్టారని, కవిత అరెస్టు అయితేనే బీజేపీపై నమ్మకం పెరుగుతుందని ఇటీవలే రాష్ట్ర నేతలు మీడియా ముందు ఊదరగొట్టారు. ఆ దిశగా కేంద్రం పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఢిల్లీ మద్యం వ్యాపారంలో సౌత్ గ్రూప్ తరఫున పాల్గొన్న వారిలో కవిత, వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఆయన కుమారుడు రాఘవ రెడ్డి, వ్యాపారస్తుడు అరుణ్ రామచంద్ర పిళ్లై, కవిత మాజీ ఆడిటర్ బుచ్చిబాబు గోరంట్ల, శరత్ చంద్రారెడ్డి ఉన్న విషయం తెలిసిందే.ఏది ఏమైనా ఢిల్లీ లిక్కర్ కేసులో రోజురోజుకూ పరిస్థితులు మారిపోతున్నాయి. ఆప్ మాత్రం తాడో పేడో తేల్చుకోవడానికి రె'ఢీ' అంటోంది. ఇంకా ఆప్ ఎంతవరకూ వెళ్తుందో తెలియట్లేదు. ఈ పరిస్థితుల్లో కవిత ఏం చేస్తారో.. ఈ వ్యవహారంలో ఎలా ముందుకెళ్తారో అన్నది తెలియాల్సి ఉంది. ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న ఈ లిక్కర్ కేసులో ఇప్పుడు కీలక పరిణామాలు చోటుచేసుకోవడంతో బీఆర్ఎస్‌లో ఒక్కసారిగా టెన్షన్ పెరిగిపోయింది.. ఏం జరుగుతుందో చూడాలి మరి.

## టీడీపీ, బీజేపీ పార్టీలలో చర్చోపచర్చలు

(మొదటిపేజీ తరువాయి)
ప్లాన్డ్ సమావేశమేనని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే చంద్రబాబు మూడు రోజుల కిందట ఢిల్లీ వెళ్లి రావడం.. ఆ తర్వాత తెలంగాణలో పొత్తులపై చర్చలు జరుగుతూండటంతో బీజేపీతో పొత్తులపై బీజేపీ హైకమాండ్ పెట్టిన ప్రతిపాదనల్ని చంద్రబాబు వారి మందు ఉంచుతారని అంటున్నారు. మరో వైపు తెలంగాణ బీజేపీ నేతలు కూడా వరుసగా అంతర్గత సమావేశాలు నిర్వహిస్తున్నారు. బండి సంజయ్ క్యాడర్ లోని పలు విభాగాల వారితో మాట్లాడుతున్నారు. కార్యదర్శులందరితో హైదరాబాద్‌లో సమావేశం పెట్టారు. త్వరలో సునీల్ బన్సల్ తెలంగాణ ప్రయటనకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అన్ని వర్గాల వారితోనూ విస్తృతంగా సంప్రదింపులు జరపనున్నట్లుగా చెబుతున్నారు. ఎన్నికల సన్నాహాలు అని చెబుతున్నారు కానీ.. ఇది టీడీపీతో పొత్తులపై అభిప్రాయాలు తెలుసుకోవడమేనని ఆ ఆ పార్టీ వర్గాలు ఓ అంచనాకు వస్తున్నాయి. అయితే టీడీపీతో పొత్తు ప్రశ్నే లేదని బండి సంజయ్ ఇప్పటికే ప్రకటించారు. చంద్రబాబు ఢిల్లీ వెళ్లి వచ్చిన తర్వాత తెలంగాణలో పార్టీల చర్చల వేగం పెరగడం మాత్రం.. నిజంగానే రెండు పార్టీల మధ్య ఏదో జరుగుతోందన్న అభిప్రాయం కల్పించడానికేనని అంటున్నారు. బీజేపీ క్యాడర్ బీజేపీతో పొత్తు కోసం అంత సుముఖంగా లేదని చెబుతున్నారు. అయితే హైకమాండ్ చెబితే మాత్రం వ్యతిరేకించలేరు. బీజేపీకి ఇరవైకి మించిన స్థానాల్లో అభ్యర్థులు లేరు. చేరిన వాళ్లు కూడా ఉంటారన్న గ్యారంటీ లేదు. అందుకే.. హైకమాండ్ భిన్నమైన ఆలోచనలు చేస్తోందని చెబుతున్నారు.

## మరో వారం ఎండలే

(మొదటిపేజీ తరువాయి)
అంటే జూన్ రెండో వారం వరకూ ఎండలు మండిపోతాయన్న మాట. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలలో జనం ఎండ, ఉక్కపోతతో సతమతమౌతున్నారు. రోహిణీ కార్తె ముగిసినా ఎండల తీవ్రత తగ్గలేదు.పైపెచ్చు రోజురోజుకూ పెరుగుతోంది. వయసుతో సంబంధం లేకుండా అన్ని వయసుల వారిపై ఎండ ప్రభావం పడుతోంది. అయితే, వృద్దులు, చిన్న పిల్లలు, ఇతర దీర్ఘకాల వ్యాదులతో బాధపడుతున్న వారిపై ఎండల ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది.రానున్న నాలుగు రోజుల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడమే కాకుండా వడగాల్పుల తీవ్రత కూడా పెరుగుతుందని పేర్కొన్నారు.

## టార్గెట్ తెలంగాణ మోడీ భారీ రోడ్ షో

(మొదటిపేజీ తరువాయి)
హైదరాబాద్ ?లో కూడా ప్రధాని మోదీ రోడ్ షో ఏర్పాట్లు చేస్తున్నట్లుగా బీజేపీ వర్గాలు తెలిపాయి. మల్కాజ్ గిరి పార్లమెంట్ పరిధిలో మోదీ రోడ్ షోతో పాటు సికింద్రాబాద్ లేదా హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొంటారని చెబుతున్నారు. రెండు రోజుల్లో మోదీ పర్యటనకు సంబంధించి తేదీలు, స్థలాలు ఖరారు అయ్యే అవకాశం ఉందని సమాచారం.ఎలాగైనా అధికారంలోకి రావాలన్న ఆకాంక్షతో వ్యూహాలకు పదును పెడుతోంది. మిషన్ 90 టార్గెట్‌గా కారు స్పీడ్‌కు బ్రేకులు వేసేందుకు యాక్షన్‌ప్లాన్ రచిస్తోంది. కర్ణాటక ఫలితాల ఎఫెక్ట్ తెలంగాణపై పడకుండా.. కసరత్తు ప్రారంభించింది. ఐదు నెలలకు ముందుగానే బీజేపీ సమరశంఖాన్ని పూరించేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేసింది. వరుసగా సమావేశాలను నిర్వహించడంతోపాటు.. చేరికలు.. పార్టీ విస్తరణ తదితర వ్యూహాలతో ఢిల్లీ పెద్దలు రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. ఇటీవలనే రాష్ట్ర నేతలతో భేటీ అయిన అమిత్ షా.. జేపీ నడ్డా.. పలు కీలక సూచనలు చేశారు. సమన్వయంతోనే లక్ష్యం సాధించవచ్చన్న విషయాన్ని చెప్పడంతోపాటు.. హైకమాండ్ యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. అంతేకాకుండా.. ఢిల్లీ పెద్దల అండ ఎప్పుడూ ఉంటుందని హామీ సైతం ఇచ్చారు.ఈ క్రమంలోనే తెలంగాణలో బీజేపీని ఎలాగైనా అధికారంలో తీసుకువచ్చేందుకు ఏకంగా ప్రధాని మోడీనే రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో పార్టీ వ్యూహాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ.. త్వరలోనే పర్యటించనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల హైదరాబాద్‌లో ప్రధాని మోడీ రోడ్డు షో నిర్వహించనున్నట్లు సమాచారం. ఎన్నికల వ్యూహంలో భాగంగానే ప్రధాని మోడీ.. తెలంగాణపై ఫుల్ ఫోకస్ తో రంగంలోకి దిగనున్నట్లు కాషాయ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ప్రధాని మోడీ హైదరాబాద్ పర్యటన, రోడ్డు షోపై పీఎంఓ నుంచి అనుమతి వచ్చిన తర్వాత బిజెపి అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు అమిత్ షా సైతం తెలంగాణలో పర్యటించనున్నారు. 15న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభలో హోంమంత్రి అమిత్‌షా పాల్గొననున్నారు. తెలంగాణ నేతలతో కూడా ఆయన సమావేశం కానున్నారు.

## సంపాదకీయం

### పాన్ ఇండియా కథా

# లోపమేనా ..!

వర్తమానంలో చిన్న, పెద్ద అనే తేడా లేకుండా హీరోలంతా పలవర్తున్న, కలవరిస్తున్న, దర్శక నిర్మాతలు ప్రచార చిత్రాలలో ఊదరగొడుతున్న పదం 'పాన్ ఇండియా చిత్రం'. మాది పాన్ ఇండియా చిత్రమని చెప్పుకోవడం ఒక సంప్రదాయంగా మారుతున్నది. 'పాన్ ఇండియా' చిత్రం అంటే ఒకేసారి బహు భాషలను లక్ష్యంగా చేసుకోవడం. ఏకకాలంలో ఆయా భాషల్లో విడుదల చేయాలి. అయితే ఇదంతా సులభం కాదు. ఎందుకంటే ప్రతి ఒక్క భాషా చిత్ర పరిశ్రమకు తమదైన 'శైలి' ఉంటుంది. 'ప్రాంతీయత' ఉంటుంది. ఆచార సంప్రదాయాలు ఉంటాయి. వీటి నేపథ్యంలో వాటికున్న వైవిధ్యాలు వేరు, విరూపాక్ష, దసరా వంటి సినిమాల కథానేపథ్యం మిగిలిన భాషా చిత్రాలకు నప్పదు. డబ్ చేసుకోవడం వేరు. మలయాళం, తమిళ, కన్నడ వంటి చిత్ర పరిశ్రమలు తమ ప్రాంతీయతకు అనుగుణంగా కథలను వ్రాసుకుని సినిమాలుగా మారుస్తాయి. ఉదాహరణకు 'కాంతారా'. అదే విధంగా తెలుగు సినిమా విరూపాక్ష, వీటిని ఏ దృష్టి కోణంలో 'పాన్ ఇండియా' చిత్రాలుగా వర్గీకరించాలనేది ప్రచార ఉబలాటం కోసం వినియోగించుకున్నప్పటికీ, తదుపరి కాలంలో మలయాళీ, హిందీ, తెలుగు భాషల చిత్రాల నేపథ్యాలకు పొసగవు. ఒక్కసారి సింహావలోకనం చేసుకుంటే గతంలో విడుదలైన రాధేశ్యామ్, లైగర్, శాకుంతలం, యశోద వంటి సినిమాలు నిర్మాత, దర్శకులనే కాకుండా ఆయా చిత్రాల హీరోలను, ప్రేక్షకులను కూడా నిరాశపరచాయి. దసరా, విరూపాక్ష వంటి చిత్రాలు బహుభాషా చిత్రాలుగా ప్రకటనలు గుప్పించినా తెలుగులో తప్పా మిగిలిన భాషలో నిరాశనే మూటగట్టుకున్నాయి. మేజర్, కార్తికేయ-2 చిత్రాలు మాత్రం జాతీయస్థాయిలో తమ స్టామినాను నిరూపించుకొన్నాయి. మిగిలిన చిత్రాలతో విజయవంతమైన చిత్రాలను పోల్చిచూస్తే ఫలితాల్లో తేడా ఎక్కడుంది అనేది స్పష్టంగానే కనిపిస్తుంది.కనుకనే విరూపాక్ష, దసరా, ఏంజెల్, రావణాసుర, దాస్ కా దమ్కీ వంటి చిత్రాలను మిగిలిన భాషలలో విడుదల చేసినా అనుకున్న ఫలితాలను ఇవ్వలేకపోయాయి. మరో కొత్త సంప్రదాయాన్ని మన ముందుకు తీసుకువస్తున్నారు మన దర్శక నిర్మాతలు. అదేటంటే, మన తెలుగులో విజయవంతమైన చిత్రాలను తరువాత మిగిలిన భాషలలో విడుదల చేస్తున్నారు. ఇలా ఇంట గెలిచి రచ్చ గెలవాలన్నా సరే ఫలితం మాత్రం నిరాశపరుస్తుంది. 'పాన్ ఇండియా' చిత్రమంటే గ్రాఫిక్స్, భారీ సెట్టింగ్స్, విదేశాలలో చిత్రీకరణ, వివిధ భాషలకు చెందిన గొప్ప గొప్ప నటులు వంటి హంగులు అనుకుంటున్నారు తప్పా, సినిమాకు ప్రధానమైన కథ అవసరమని ఎవరూ ఊహించలేకపోతున్నారు.కొన్ని చిత్రాల్లో సాంకేతిక హంగులన్నీ ఉంటాయి కానీ కథ ఉండదు. సూపర్ స్టార్స్, మెగాస్టార్ ఇలా రకరకాలైన స్టార్స్ తమ పరిధిలో చేతులు పెడుతూ చిత్రం అపజయానికి తమదైన సహాయం చేస్తున్నారు. అందరూ ఇలా ఉంటారని కాదు. కానీ ప్రేక్షకులను మెప్పించటం కోసం కొత్తగా వస్తున్న యువదర్శకుల సృజనలో జోక్యం చేసుకుంటున్నారు. అటువంటి పాన్ ఇండియా చిత్రాలు సోదిలోకి కూడా లేకుండా పోతున్నాయి. సొంత బ్యానర్‌లో తీసుకున్న కాకలు తీరిన అనుభవం ఉన్న నిర్మాతలు కూడా మునిగిపోతున్నారు. క్రమంగా దర్శక, నిర్మాత, నటీనటులకు 'పాన్ ఇండియా' వాస్తవాలు తెలుస్తున్నాయి. ఇంట గెలిచే ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. పవన్ కళ్యాణ్, మహేష్ బాబు, రామ్, రవితేజ తదితరులంతా 'పాన్ ఇండియా' చిత్రాల నిర్మాణంలో ఉన్నారు. వీరంతా గతకాలపు చేదు అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటారా? లేదా? ముందుగా తెలుగు ప్రేక్షకులను మంచి కథలతో మెప్పించి విజయం సాధించాక మిగిలిన భాషల వైపు చూస్తారా? లేదా? అనేది కాలం చెప్పాలి. ఏది ఏమైనా కథను కాదని కేవలం హంగులద్ది నటీనటులను ఏరి కోరి, శ్రమకోర్చి తెచ్చి 'పాన్ ఇండియా' చిత్రాలను నిర్మిస్తే నిరాశపూరిత ఫలితాలు పునరావృతం కాక తప్పదు అనేది వాస్తవం. సినిమా నిర్మాణం అంటే కోట్లాది రూపాయలు ఖర్చు మాత్రమే కాదు. మానవ వనరుల శ్రమ కూడా. ఒక సినిమా విజయవంతం అయితే లైట్ బాయ్ నుంచి హీరో వరకు మరో చిత్రం లభిస్తుంది. ఉపాధికి అవకాశం ఉంటుంది. గొప్ప గొప్ప హీరోలకు 'పాన్ ఇండియా' ఫలితాలు ఏమీ చేయలేకపోవచ్చు. కానీ ఆ సినిమా నిర్మాణం వెనక పనిచేసే కొన్ని వందల మంది కార్మికులతో పాటు సదరు నిర్మాత గాలి కొట్టుకుపోతాడు. వారిపై జాలిపడేవారు కూడా ఉండరు. దర్శక నిర్మాతలు 'పాన్ ఇండియా' సినిమాకు ముందుగా 'పాన్ ఇండియా' స్థాయి కలిగిన కథ అవసరమని గుర్తించాలి.

### తెలంగాణలో మారుతున్న

# రాజకీయ సమీకరణాలు

(మొదటిపేజీ తరువాయి)
తొమ్మిదేళ్ల పాలనలో భాగంగా ప్రజల్లోకి వెళ్తుంది. అయితే అసలు టార్గెట్ మాత్రం తెలంగాణలో పార్టీ బలోపేతం కోసమేనని తెలుస్తోంది. జూన్ 15న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఖమ్మంకు రానున్నారు. 25వ తేదీన నాగర్ కర్నూల్ జిల్లాకు రానున్న జేపీ నడ్డా.. అక్కడ నిర్వహించే బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఇక ప్రధాని నరేంద్ర మోదీతో భారీ బహిరంగ సభకు ప్లాన్ చేస్తోంది రాష్ట్ర పార్టీ నాయకత్వం. అయితే, మోదీతో హైదరాబాద్ నగరంలో సుదీర్ఘ రోడ్ షో నిర్వహించే విషయం ఫైనల్ దశలో వుందని సమాచారం. పీఎంఓ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాత తెలంగాణ బీజేపీ నాయకత్వం మోదీ రోడ్ షోపై ప్రకటన చేస్తారని తెలుస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సమీపించడంతో బీజేపీ అగ్రనేతలు తెలంగాణలో ఎన్నికల శంఖారావాన్ని పూరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకు కాషాయ దళం ఢిల్లీ పెద్దలు రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు నిర్వహించాలని నిర్ణయించారు. ఒక్క జూన్ నెలలోనే ముగ్గురు అగ్రనేతలు తెలంగాణ రాష్ట్రంలో పర్యటించనున్నారు. ప్రధాని మోదీతో పాటు బీజేపీ అగ్రనేతలు అమిత్ షా, జేపీ నడ్డా తెలంగాణ పర్యటనకు రానున్నారని పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. ఒక్కో సభకు ఒక్కో అగ్రనేత ముఖ్యఅతిథిగా పాల్గొనేలా మూడు భారీ బహిరంగసభల నిర్వహణకు తెలంగాణ బీజేపీ ప్లాన్ చేసింది. ఈ బహిరంగ సభ ద్వారా రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాబోతోందన్న సంకేతాలను ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లేలా వ్యూహం రచించింది భారతీయ జనతా పార్టీ.కర్నాటకలో ప్రతికూల ఎన్నికల ఫలితాల ప్రభావం నుంచి బయటపడేందుకు ముగ్గురు అగ్రనేతలను జూన్ నెలలోనే తెలంగాణ పర్యటనలకు తీసుకురావాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. పైకి 9 ఏళ్ల మోదీ పాలన పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా మహా జనసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగానే తెలంగాణలో మూడు లేదా నాలుగు బహిరంగ సభలను నిర్వహిస్తున్నామని చెబుతున్నారు. వాస్తవానికి మాత్రం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీని, కేడర్లను ఎన్నికలకు సమాయత్తం చేయడంలో భాగంగానే ఈ సభలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ ముఖ్య నేతలు చెబుతున్నారు. తెలంగాణలో అధికారంలోకి రావాలని భావిస్తున్న బీజేపీ ఒకటి రెండేళ్లుగా తెలంగాణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇదే సమయంలోనే తెలంగాణలో పొత్తుల చుట్టూ ఇప్పుడు ఆసక్తికర రాజకీయాలు జరుగుతున్నాయి. ఢిల్లీలో అమిత్‌షా- చంద్రబాబు భేటీ జరిగింది. దీంతో పాత స్నేహం చిగురిస్తుందా అనే ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. ఈ భేటీ తర్వాత చంద్రబాబు మీడియాతో మాట్లాడలేదు. బీజేపీ వైపు నుంచి కూడా ఎలాంటి ప్రకటన లేదు. పొత్తులు ఉండొచ్చంటూ ఊహాగానాలే తప్ప దాన్ని బలపరిచేలా రెండు వైపుల నుంచి ఎలాంటి ప్రకటనలు లేవనే చెప్పాలి. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న కాంగ్రెస్.. కేసీఆర్ వ్యతిరేకశక్తుల పునరేకీరణ ప్రయత్నాలు చేస్తోంది. అయితే, టీడీపీతో పొత్తు కేవలం ఊహాగానమేనని బండి సంజయ్ కుమార్ ఆఫ్ ది రికార్డు చెప్పారు. బీజేపీ అధికార ప్రతినిధి ప్రకాశ్ రెడ్డి సైతం టీవీ9 బిగ్ డిబేట్‌లో పాల్గొని ఇదే విషయాన్ని కుండబద్దలు కొట్టారు. తెలంగాణలో బీజేపీకి టీడీపీతో జతకట్టాల్సిన అవసరం లేనేలేదని ప్రకాశ్ రెడ్డి అన్నారు. అయితే, పొత్తులపై తేల్చేది రాష్ట్ర నాయకత్వం కాదన్నది అందరికీ తెలిసిన విషయమే. ఏపీలో చంద్రబాబుకు బీజేపీ ఓటుబ్యాంకు ఉపయోగపడితే.. తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో ఇప్పటికీ టీడీపీకి ఎంతో కొంత ఓటుబ్యాంకు వుంది. అది తెలంగాణలో బీజేపీ వైపు మళ్ళాలన్నది ఉభయకుశలోపరి చంద్రబాబు, అమిత్ షాల ప్రతిపాదన అని తెలుస్తోంది. ఇక 2018 అసెంబ్లీ ఎన్నికలు తర్వాత తెలంగాణలో జరిగిన దుబ్బాక, హుజురాబాద్ ఉప ఎన్నికల్లో విజయం, మునుగోడులో స్వల్ప మెజారిటీతో ఓడిపోవడం, ఇటీవలి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో విజయం, జీహెచ్ఎంసీలో ఏకంగా 48 కార్పోరేటర్లను గెలుచుకున్న బీజేపీ తెలంగాణలో పాగా వేసేందుకు సిద్ధమైంది. ఒక్క కర్నాటకలో ప్రతికూల ఫలితం మినహాయిస్తే మిగతా అంశాల్లో ఆ పార్టీ రాష్ట్రంలో మంచి ఊపుమీద ఉంది. ఈ నేపథ్యంలో ఇదే జోరుతో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొని సత్తా చాటాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కేసీఆర్ పాలనలో ఏ విధంగా దెబ్బతిన్నదనే అంశంపై ఆయా రంగాల వారీగా వివరించడంతో పాటు వినూత్న రూపాల్లో నిరసనలు తెలపాలని కమలదళం నిర్ణయించింది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు దినోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో అందుకు భిన్నంగా కేసీఆర్ పాలనలో వ్యవసాయ రంగం ఏ విధంగా దెబ్బతిన్నది? రైతులకిచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన తీరును జనంలోకి తీసుకెళ్లేందుకు సిద్ధమైంది.ఇక కర్నాటక విజయంతో ఊపు మీదున్న కాంగ్రెస్ నేతలు తాజాగా దూకుడు పెంచారు. పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక వధేరాలతో తెలంగాణలో భారీ బహిరంగ సభలకు తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ప్లాన్ చేస్తోంది. అమెరికా పర్యటనలో వున్న రాహుల్ గాంధీ ఇండియాకు చేరుకున్న వెంటనే ఆయన తెలంగాణ షెడ్యూలును ఖరారు చేస్తారని తెలుస్తోంది. నిజానికి ఆయన అమెరికాలో వున్నప్పటికీ రాహుల్ టీమ్ తెలంగాణపై ఫోకస్ కొనసాగిస్తోంది. ఓవైపు వరుస కార్యక్రమాలను ప్లాన్ చేస్తూనే ఆపరేషన్ ఆకర్షను వేగవంతం చేసింది రాహుల్ గాంధీ టీమ్. ఇందులో భాగంగా మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు గాలమేయడంలో రాహుల్ బృందం దాదాపు విజయవంతమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి వున్న సమాచారం నిజమైతే జూపల్లి, పొంగులేటి జూన్ మూడో వారంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకోబోతున్నారు. చేరికలతోపాటు రాహుల్, ప్రియాంకలిద్దరు తెలంగాణలో విస్తృతంగా పర్యటించబోతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. జూన్ 21న గానీ, 25న గానీ అయితే రాహుల్ లేదా ప్రియాంక సమక్షంలో జరపనున్న భారీ బహిరంగ సభల్లో జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిజానికి పొంగులేటి, జూపల్లిలను పార్టీలో చేర్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీతోపాటు బీజేపీ నేతలు కూడా శతవిధాలా ప్రయత్నించారు. బీజేపీ చేరికల కమిటీ ఛైర్మన్‌గా ఉన్న ఈటల రాజేందర్ వీరిద్దరితో పలు విడతలుగా సమాలోచనలు జరిపారు. ఏకంగా ఖమ్మం వెళ్ళి కూడా గంటల తరబడి చర్చలు జరిపారు. ఆ తర్వాత శామీర్‌పేటలోని ఈటల ఫామ్ హౌజ్‌లో వీరితో బీజేపీ నేతల చివరి విడత సమాలోచనలు సుదీర్ఘంగా జరిగాయి. ఆ తర్వాత పరిణామాలు మారి?యాయి. వీరిద్దరు బీజేపీ వైపు కాకుండా కాంగ్రెస్ పార్టీ వైపు పయనిస్తున్నట్లు క్రమంగా క్లారిటీ వచ్చేసింది. ఆ తర్వాత ఓ సందర్భంలో ఈటల చేసిన కామెంట్లు సంచనలమయ్యాయి. ఈ ఇద్దరు నేతలు (పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు) తనకు రివర్స్ కౌన్సిలింగ్ ఇస్తున్నారని ఈటల వ్యాఖ్యానించడంతో వారిపై బీజేపీ ఆశలు వదులుకున్నట్లుగా తేలిపోయింది.ఇన్నాళ్లూ వాళ్లు కాంగ్రెస్‌లోకి వెళ్లకుండా ఆపగలిగాను తప్ప వారి మనసు మార్చలేకపోయానన్నది ఈటల రాజేందర్ కామెంట్ల సారాంశం. మరోవైపు బీజేపీ నేతల కంటే కాంగ్రెస్ పార్టీ నేతలే కాస్త వ్యూహాత్మకంగా వ్యవహరించారు. దానికి కర్నాటక ఫలితం తోడవడంతో వీరిద్దరు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. పొంగులేటి, జూపల్లితో రాహుల్ గాంధీ టీమ్ రహస్యంగా సమావేశమై చర్చించింది. తెలంగాణ కాంగ్రెస్‌లోని కొందరు సీనియర్ నేతలు కూడా తమ వంతు ప్రయత్నం చేశారు. పొంగులేటి, జూపల్లి చేరడమే కాకుండా తమ అనుచరులకు కూడా టికెట్స్ ఇవ్వాలని మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నారు. ఈ షరతులకు రాహుల్ గాంధీ టీమ్ నుంచి సానుకూల స్పందన వచ్చినట్టు తెలుస్తోంది. పొంగులేటి, జూపల్లి ఇద్దరికీ టికెట్స్ ఇవ్వడంతోపాటు.. వాళ్ల అనుచరులకు టికెట్ల విషయంలో ప్రాధాన్యత ఇస్తున్నట్టు సమాచారం. ఇక జూన్ నెలలో రాహుల్, ప్రియాంక వేరువేరుగా లేదా కలిసి తెలంగాణలో పర్యటించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మరో 3 రోజులు వానలు

**హైదరాబాద్-ప్రభాత సూర్యుడు :** నైరుతి రుతుపవనాలు రాగల 48 గంటల్లో కేరళలో ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మూడు రోజులు తెలంగాణ రాష్ట్రంలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈరోజు కొన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో వడగళ్ల వాన కురుస్తుందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రేపు ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు వడగళ్ల వాన హెచ్చరికలు జారీ చేశారు.ఇక 9వ తేదీన ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాపల్లి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పలుచోట్ల వడగళ్ల వాన కురుస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అలాగే పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. 10వ తేదీన వరంగల్, మహబూబాబాద్, హనుమకొండ, సూర్యాపేట, నల్గొండ, ఆదిలాబాద్, ఖమ్మం, పెద్దపల్లి, నిర్మల్, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాలలో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయి. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో వడగళ్ల వాన కురుస్తుందని తెలిపారు. నిన్న రాష్ట్రంలో అత్యధికంగా భద్రాచలం, ఖమ్మంలో 43 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. పటాన్‌చెర్వులో అత్యల్పంగా 22.6 డిగ్రీలు నమోదైంది. దాదాపు అన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు పైగా, కనిష్ట ఉష్ణోగ్రత 25 డిగ్రీలకు మించి నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది.

# మార్చురిలో లేచి కూర్చున్న వ్యక్తి

**భువనేశ్వర్ - ప్రభాత సూర్యుడు :** మాటలకందని మహా విషాద ఘటన ఒడిశా రైలు ప్రమాదం గురించి అందరికీ తెలిసిందే. అయితే ఈ ఘటనలోమొత్తం 288 మంది ప్రాణాలు కోల్పోగా.. 900 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. అయితే చనిపోయిన వారి మృతదేహాలను మార్చురీలో ఉంచారు. ఈ క్రమంలోనే మృతదేహాలను గుర్తించేందుకు వెళ్లిన ఓ అధికారికి భయానక ఘటన ఎదురైంది.మార్చురీలోంచి ఆ అధికారి బయటకు నడుచుకుంటూ వెళ్తుంటే.. సడెన్ గా ఎవరో ఆయన కాలును పట్టుకున్నారు. దీంతో ఆ అధికారి ఫ్యూజుల అవుట్ అయ్యాయి. ప్రాణ భయంతో వణికిపోతూ కిందికి చూశాడు. ఎవరో అని చూసే సరికి చనిపోయాడనుకొని మార్చురీలో పడుకోబెట్టిన వ్యక్తి తన కాళ్లు పట్టుకున్నాడు. అదే భయంతో కేకలు వేశాడు. అక్కడే ఉన్న సిబ్బంది వచ్చి చూస్తే వారంతా కూడా షాక్ అయ్యారుమృతదేహాలను ఉంచేందుకు అధికారులు ఓ పాఠశాలలో మార్చురీని ఏర్పాటు చేశారు. ఈక్రమంలోనే రెస్క్యూ టీం సభ్యుడు అటుగా వెళ్తుంటే ఓ వ్యక్తి అతని కాలును పట్టుకున్నాడు. విపరీతంగా భయపడుతూనే.. అతనెవరో చూసే ప్రయత్నం చేశాడు అధికారి. ఈక్రమంలోనే అతడు 35 ఏళ్ల వయసు ఉన్న రాబిన్ నయాగా గుర్తించారు. అతను రెండు కాళ్లు కట్ అయిపోయి బతికి ఉండడాన్ని గమనించి వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కోరమండల్ ఎక్స్ ప్రెస్ ప్రమాదంలో షాకింగ్ విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఈ ఘటనలో మొత్తం 288 మంది ప్రాణాలు కోల్పోగా, అందులో కనీసం 40 మంది ప్రయాణికులు కరెంట్ షాక్ తో చనిపోయారని అధికారులు చెబుతున్నారు. ఘటనాస్థలంలో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించిన సిబ్బంది.. బోగీల నుండి మృతదేహాలను వెలికితీయగా.. అయితే ఓ బోగీలో నుంచి దాదాపు 40 మృతదేహాలపై ఎలాంటి గాయాలు అయిన ఆనవాళ్లు కనిపించలేదని తెలిపారు. ఇదే విషయాన్ని ప్రభుత్వ రైల్వే పోలీసులు కూడా తమ ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు.రైలు ప్రమాదం ఘటనలో చనిపోయిన వారి సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందని, కానీ ప్రభుత్వం నిజాలు దాచిపెడుతోందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కేంద్రంపై, రైల్వే శాఖపై తీవ్ర ఆరోపణలు చేశారు. 500కు పైగా ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయి ఉంటారు, కానీ కేంద్రం నిజాలు దాచిపెడుతోందని ఆరోపించారు. మమతా మంగళ వారం సైతం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం, రైల్వే శాఖ ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంద న్నారు. అయితే కేసును సీబీఐకి అప్పగించి అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రైలు దుర్ఘనటలో మొత్తం 288 మంది మృతి చెందగా.. అందులో 100 మృతదేహాలను ఇప్పటికీ గుర్తించలేకపోయారు. వాళ్లు ఎవరూ అనేది ఇప్పటికీ అధికారులు తేల్చలేదు. ఇప్పటికే 80 గంటలు గడిచిపోయాయి. ముక్కలుగా మారిన మృతదేహాలను ఎక్కువ రోజులు ఉంచలేమని ఢిల్లీలోని ప్రీమియర్ ఎయిమ్స్ ఆస్పత్రికి చెందిన సీనియర్ వైద్యుడు ఒకరూ చెబుతున్నారు. ముక్కలైన మృతదేహాలను ఎక్కువ సేపు ఉంచడం కూడా అడ్వైజబుల్ కాదని చెప్పారు. ఇప్పటికే డీఎన్ఏ మ్యాచింగ్ కోసం రక్త నమూనాలను కూడా సేకరిస్తున్నట్లు చెప్పుకొచ్చారు.

# ఖమ్మంపై అన్ని పార్టీల గురి

**భువనేశ్వర్ - ప్రభాత సూర్యుడు :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు మరికొన్ని నెలల్లో జరగనున్నాయి. దీంతో అధికార పార్టీ బీఆర్ఎస్ సహా.. ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, లెఫ్ట్ పార్టీలు వ్యూహాలకు పదునుపెట్టాయి. మళ్లీ అధికారాన్ని చేజిక్కించుకోవాలని బీఆర్ఎస్.. గట్టి పోటీ ఇచ్చి ఆ పార్టీకి చెక్ పెట్టాలని కాంగ్రెస్, బీజేపీ సన్నాహాలను ప్రారంభించాయి. ఈ తరుణంలో అన్ని పార్టీలు ఉద్యమాల ఖిల్లా ఖమ్మం జిల్లాపై ఫోకస్ పెంచడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సత్తా చాటా లని ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో బలమైన నేతగా ఉన్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయడంతో ఖమ్మం జిల్లాలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఆయన ఏ పార్టీలో చేరనప్పటికీ.. వరుస పర్యటనలు చేస్తూ రాజకీయాలను హీటెక్కిస్తుండటం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.. అదే రితీలో బీఆర్ఎస్ పార్టీ నేతలు, లెఫ్ట్ పార్టీలు సైతం ఉమ్మడి జిల్లాలో వరుస పర్యటనలు చేస్తూ సత్తా చాటేందుకు ప్రయత్నిస్తున్నారు.ఈ క్రమంలో ఓ వైపు బీఆర్ఎస్.. మరోవైపు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం.. ఖమ్మం దృష్టి సారించగా.. అదేరీతిలో బీజేపీ సైతం ఖమ్మంపై కన్నేసింది.. దీంతో ఖమ్మం రాజకీయాలు హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రమంలో అన్ని జాతీయపార్టీలు ఖమ్మం గుమ్మం లో సత్తా చాటేందుకు తహతహలాడుతున్నా యి. ఈ నెలలోనే కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు సైతం ఖమ్మానికి రానున్నారు. ఖమ్మంలో 15న హోంమంత్రి అమిత్ షా సభ జరగనుంది.. 20 లేదా 25న రాహుల్ గాంధీ లేదా ప్రియాంక గాంధీ ఎవరో ఒకరితో కాంగ్రెస్ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

# 9న మంచిర్యాలలో సీఎం కేసీఆర్ పర్యటన

## ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్ బాల్క సుమన్



**మంచిర్యాల-ప్రభాత సూర్యుడు :** ఈనెల 9న ముఖ్యమంత్రి కేసీఆర్ మంచిర్యాల జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించబోయే బహిరంగ సభ వేదిక పనులను బుధవారం ప్రభుత్వ విప్ బాల్క సుమన్, పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్ రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ .. బహిరంగ సభకు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపుఈ నెల 9వ తేదీన సీసీసీ నస్పూర్ లో నూతన కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవం, పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కోసం మంచిర్యాల జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో సామాన్య ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ సమస్య కలగకూడదనే ఉద్దేశ్యంతో 9న ఉదయం నుండి ట్రాఫిక్ మళ్లింపు చేపట్టడం జరిగిందని పోలీస్ అధికారులు వెల్లడించారు. గోదావరిఖని, చెన్నూరు వైపు నుండి మంచిర్యాల వైపు వచ్చే వాహనదారులు శ్రీరాంపూర్ జిఎం ఆఫీస్ వద్ద ఉన్న నేషనల్ హైవే ఫ్లైఓవర్ మీదుగా క్యాతనపల్లి గాంధారి వనం నుండి మంచిర్యాల వైపు వెళ్లాలని, మంచిర్యాల వైపు నుండి శ్రీరాంపూర్, చెన్నూరు, గోదావరిఖని వైపు వెళ్లే వాహనదారులు మంచిర్యాల ఐబి చౌరస్తా నుండి క్యాతనపల్లి గాంధారి వనం వద్ద గల నేషనల్ హైవే ఫ్లైఓవర్ మీదుగా శ్రీరాంపూర్ జిఎం ఆఫీస్ వద్ద నుండి వెళ్లాలని సూచించారు.

# రైతులకు కేంద్రం శుభవార్త

**హైదరాబాద్-ప్రభాత సూర్యుడు :** ఖరీఫ్ పంటలపై కనీసమద్దతు ధర(ఎంఎస్పీ) పెంచుతూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. పెసర పంటకు 10.4 శాతం, వేరుశెనగ 9 శాతం , నువ్వులు శాతం, వరి 7 శాతం, సోయాబీన్, రాగులు, జొన్న, పొద్దు తిరుగుడు పంటకలకు సుమారుగా 6-7 శాతం చొప్పున 2023-2024 ఆర్థిక సంవత్సరానికి ఎంఎస్పీని పెంచుతూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. 2023-24 మార్కెటింగ్ సీజన్ కోసం ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర పెంపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, సాగుదారులకు వారి ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలను నిర్ధారించడం, పంటల వైవిధ్యతను ప్రోత్సహించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. వరి (సాధారణ) ఎంఎస్పి క్వింటాల్‌కు రూ. 143 పెంచి, రూ. 2,183గా నిర్ణయించినట్లు తెలిపారు. గత సీజన్‌లో క్వింటాల్‌కు రూ. 2,040 ఉంది. అంటే 7 శాతం పెంచారు. వరి ఎంఎస్పి (ఎ గ్రేడ్) క్వింటాల్‌కు రూ. 2,203గా నిర్ణయించబడింది, ఇది గతేడాది క్వింటాల్‌కు రూ. 2,060 ఉండేది. పెసరకు గతేడాది ఎంఎస్పీ క్వింటాల్ కి రూ. 7,755 ఉంటే ఈ ఏడాది రూ. 803 పెంచి, రూ. 8,558గా మద్దతు ధరను నిర్ణయించారు.

# అంగన్వాడీ కేంద్రంలో సామూహిక అన్నప్రాసన



**జగిత్యాల -ప్రభాత సూర్యుడు :** జగిత్యాల పట్టణంలోని జండా మైల్లా అంగన్వాడి కేంద్రంలో బుధవారం సామూహిక అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అర్బన్ సూపర్వైజర్ రాణి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. బిడ్డకు ఆరు నెలలు వచ్చేవరకు తల్లి పాలు తప్ప ఎలాంటి ఆహారం ఇవ్వకూడదని తెలిపారు. ఆరు నెలలు నిండిన తర్వాత అనుబంధ పోషకాహారాన్ని ప్రారంభించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సౌజన్య, తల్లులు పాల్గొన్నారు.

# వివేకా హత్య లేఖపై నిన్ హైడ్రిన్ పరీక్షకు కోర్టు అనుమతి



**హైదరాబాద్ -ప్రభాత సూర్యుడు :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. వివేకా హత్య సమయంలో లభ్యమైన లేఖపై నిన్ హైడ్రిన్ పరీక్షకు కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ టెస్ట్‌తో లేఖపై ఉన్న వేలిముద్రలను గుర్తించనున్నారు. వివేకా లేఖపై వేలి ముద్రలు గుర్తింపునకు నిన్ హైడ్రిన్ టెస్ట్ నిర్వహించనున్నారు. నిన్ హైడ్రిన్ పరీక్షకు అనుమతి ఇవ్వొద్దని నిందితులు పేర్కొన్నారు. నిన్ హైడ్రిన్ పరీక్షకు అభ్యంతరం లేదని అప్రూవర్ దస్తగిరి తెలిపారు. ఇదిలావుండగా.. వివేకా హత్య జరిగిన స్థలంలో ఈ లేఖ లభించింది. ఈ లేఖను అధికారులు ఫోరె న్సిక కు పంపారు. అయితే ఈ లేఖను ఒత్తిడిలో రాసినట్టు సీఎఫ్ఎస్ఎల్ నివే దికలు తేల్చాయి. దీంతో లేఖపై ఉన్న వేలిముద్రలు గుర్తించాలని సీబీఐ నిర్ణయించింది.

# మున్సిపల్ కార్మికుడు అనారోగ్యంతో మృతి

### ఆర్థిక సహాయం చేసిన కౌన్సిలర్



**నందికొట్కూరు -ప్రభాత సూర్యుడు :** నందికొట్కూరు మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ విభాగంలో శేషాద్రి పనిచేసే కార్మికుడు అనారోగ్యంతో బుధవారం మృతి చెందడం జరిగింది విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు అనంతరం ఆయన ఆదేశాల మేరకు కౌన్సిలర్ చెరుకు సురేష్ మృతుని కుటుంబానికి బుధవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని సి.యస్.ఐ పాలెంలో నివాసం ఉంటున్న శేషాద్రి మరణించడం ఎంతో బాధాకర విషయం అని ఇంజనీరింగ్ విభాగంలో ఏదైనా సమస్య వస్తే వెంటనే తన వంతుగా వెళ్లి పరిష్కారం చేసేవారు అని తెలిపారు .కుటుంబ సభ్యులను ఓదార్చి, అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పట్టణంలోని పారిశుధ్య కార్మికులు చేరుకుని శేషాద్రి మృతదేహాన్ని చూసి విలపించారు. తమతో కలసి రోజు పనులు చేసే విగత జీవిగా పడి ఉండడాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

### రూ.150 కోట్లతో చేపట్టిన

# పలు అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన



**ములుగు -ప్రభాత సూర్యుడు :** ములుగు జిల్లాలో పర్యటనాలో బాగంగా పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రూ. 150 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి మహమూద్ అలీతో కలిసి హెలికాప్టర్‌లో ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేరుకున్న కేటీఆర్‌కు మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ స్వాగతం పలికారు. డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న సమీకృత కలెక్టరేట్ భవన సముదాయానికి, దాని పక్కనే రూ. 38.50 కోట్లతో నిర్మించనున్న జిల్లా పోలీసు కార్యాలయ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ కార్యాలయాల పక్కా భవనాలు, మోడల్ బస్టాండ్ సముదాయానికి, సేవాలాల్ భవనానికి సైతం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, చీఫ్‌విప్ వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ కవిత, ఎమ్మెల్యే సీతక్క తదితరులు పాల్గొన్నారు. అనంతరం ములుగు జిల్లా కేంద్రం నుంచి రామప్ప దేవాలయానికి చేరుకొని శిల్ప సంపదను తిలకించి రుద్రేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తారు. రామప్ప చెరువు కట్ట వద్దకు చేరుకొని తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాగునీటి ఉత్సవాలను ప్రారంభించి, అకడ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం జిల్లా కేంద్రానికి చేరుకొని ములుగు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో రూ. 30 లక్షలతో నిర్మించే డిజిటల్ లైబ్రరీ, రూ. 15 లక్షలతో నిర్మించే సమాచార పౌర సంబంధాల శాఖ మీటింగ్ హాల్ పనులకు శంకు స్థాపనలు, జిల్లా కేంద్రంలో రూ. 2కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి సాధన స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు.

# తెలంగాణ అకడమిక్ క్యాలెండర్ విడుదల

**హైదరాబాద్-ప్రభాతసూర్యుడు :** తెలంగాణలోని పాఠశాలలకు సంబంధించిన 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను ప్రభుత్వం జూన్ 6న విడుదల చేసింది. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతులకు కొత్త అకడమిక్ క్యాలెండర్ వర్తించనుంది. ఈ అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం.. ఈ విద్యాసంవత్సరంలో మొత్తం 229 రోజులు స్కూళ్లు పని చేయనున్నాయి. స్కూళ్లు జూన్ 12న ప్రారంభమై.. ఏప్రిల్ 23న ముగియనున్నాయి. అంటే ఈ విద్యాసంవత్సరంలో మొత్తం 229 రోజులపాటు పాఠశాలలు పనిచేయనున్నాయి. ఈ మేరకు పరీక్షల క్యాలెండర్‌కు సంబంధించి ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్‌కు, మోడల్ స్కూళ్ల డైరెక్టర్‌కు, ప్రభుత్వ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్‌కు, ఎస్ఐఈటీ డైరెక్టర్‌కు, గురుకుల విద్యాలయాల డైరెక్టర్‌కు, హైదరాబాద్, వరంగల్ రీజినల్ జాయింట్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లకు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్ అధికారులకు.. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలు జారీచేశారు.

**తాజా అకడమిక్ క్యాలెండర్ ప్రకారం...**

- ఈ ఏడాది జూన్ 12న పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. 2024 ఏప్రిల్ 23తో విద్యాసంవత్సరం ముగియనుంది.
- ఈ విద్యాసంవత్సరంలో మొత్తం 229 రోజులపాటు పాఠశాలలు పనిచేయనున్నాయి.
- 2024 ఏప్రిల్ 24 నుంచి 2024 జూన్ 11 వరకు వేసవి సెలవులు ఇవ్వనున్నారు.
- 2024 జనవరి 10న పదో తరగతి సిలబస్ పూర్తిచేసి, ఫాఅ బోర్డ్ ఎగ్జామినేషన్ లోపల రివిజన్ క్లాసులు, ప్రీ ఫైనల్ పరీక్షలు పూర్తిచేయనున్నారు.
- ఇక 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సిలబస్‌ను 2024 ఫిబ్రవరి 29న పూర్తిచేసి, 2024 మార్చిలో జరగబోయే ఎస్ఏ-2 పరీక్ష కోసం రివిజన్, రెమెడియల్ టీచింగ్, ప్రిపరేషన్ నిర్వహించనున్నారు.
- ఈ ఏడాది అసెంబ్లీ అనంతరం అన్ని తరగతుల్లో 5 నిమిషాలపాటు యోగా సెషన్ కోసం కేటాయించనున్నారు. 2023 జూన్ 6 నుంచి 2023 జూన్ 9 వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.
- 2024 ఏప్రిల్ 24 నుంచి 2024 జూన్ 11 వరకు అంటే 49 రోజులు వేసవి సెలవులు ఉంటాయి. దసరా సెలవులు అక్టోబర్ 13 నుంచి 25వ తేదీ వరకు 13 రోజుల పాటు ఉంటాయని ప్రభుత్వం తెలిపింది. ఇంకా సంక్రాంతి సెలవులు 2024 జనవరి 12 నుంచి 17వ తేదీ వరకు మొత్తం 6 రోజులు ఉంటాయని వెల్లడించింది. రీక్షల షెడ్యూలు ఇలా..
- ఫార్మాటివ్ అసెస్‌మెంట్ (ఈం)-1 పరీక్షలను ఈ ఏడాది జులై 31 నాటికి నిర్వహించనున్నారు.
- ఫార్మాటివ్ అసెస్‌మెంట్ (ఈం)-2 పరీక్షలను ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి నిర్వహించనున్నారు.
- సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ా౦)-1 పరీక్షలను ఈ ఏడాది అక్టోబర్ 5 నుంచి అక్టోబర్ 11 వరకు, ఫార్మాటివ్ అసెస్‌మెంట్ (ఈం)-3 పరీక్షలను ఏడాది డిసెంబర్ 12 లోపు, ఫార్మాటివ్ అసెస్‌మెంట్ (ఈం)-4 పరీక్షలను 2024 జనవరి 29 లోపు పూర్తిచేయనున్నారు.
- సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ా౦)-2 పరీక్షలను 2024 ఏప్రిల్ 8 నుంచి 2024 ఏప్రిల్ 18 వరకు (1 నుంచి 9 తరగతులకు), ప్రీ ఫైనల్ (10వ తరగతి) పరీక్షలను 2024 ఫిబ్రవరి 29లోపు నిర్వహించనున్నారు.
- ఇక పదోతరగతి వార్షిక పరీక్షలను 2024 మార్చి నెలలో నిర్వహించనున్నట్లు పరీక్షల షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

రాష్ట్రాల్లో 2023 విద్యా సంవత్సరం ఇంటర్ చదువుతున్న 120 మంది పేద విద్యార్థులకు 'విద్యాధన్' స్కాలర్‌షిప్‌లు విద్యాధన్ పేరిట సరోజిని దామోదరన్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌లు అందజేస్తోంది. 90 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. విద్యార్థుల కుటుంబ ఆదాయం ఏడాదికి రూ. 2 లక్షలలోపు ఉండాలి. సరైన అర్హతలు గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చు. ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు జూన్ 15, తెలంగాణ విద్యార్థులు జూన్ 20 వరకు దరఖాస్తు చేసుకోవాలి. రాత పరీక్షలు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ఇంటర్‌లో ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ. 10 వేల చొప్పున, వారు డిగ్రీలో చేరితే రూ. 10 వేల నుంచి రూ. 60 వేల వరకు స్కాలర్‌షిప్‌లు అందచేస్తారు.

# నందికొట్కూర్ మండల ఉపాధి పనులపై సమీక్ష

**నందికొట్కూరు -ప్రభాత సూర్యుడు :** నందికొట్కూరు మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ఎంపీడీవో శోభారాణి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి కూలీకి ఉపాధి పని కల్పించేలా అధికారులు చర్యలు సూచించారు. ఉపాధి పనుల వద్ద, వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక మౌలిక వసతులు కల్పించాలన్నారు. గిట్టుబాటు కూలి వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఉపాధి పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు కాబట్టి ప్రతి అధికారి బాధ్యతగా పనిచేసే ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215